

యాసంగి పంటల సాగుకు తైబందు ఖరారు

బొంరాస్‌పేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్లకుంట ఎల్లమ్మ చెరువు కింద గల ఆయకట్టు యాసంగి పంటలకు నీటిని విడుదల చేసేందుకు శనివారం తైబందు ఖరారు చేశారు. 165 ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు అవకాశం ఉందని రైతులు తెలిపారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్‌కు తీర్మాన పత్రాన్ని అందించినట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మాజీ ఎంపీటీసీ నర్సింహులునాయుడు, నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కి.. యువకుడు ఆత్మహత్య

- చెల్లించిన డబ్బులకు పది రెట్లు ఇస్తామని బురిడీ కొట్టించిన సంస్థ
- రూ.37వేలు చెల్లించిన పోషిరెడ్డి
- ఇంకా డబ్బులివ్వాలని డిమాండ్

5



అగమ్యగోచరం.. కార్మికుల జీవితం

- కాంట్రాక్టర్ల చేతిలో చితికిపోతున్న శ్రమజీవులు
- పరిశ్రమల్లో ఇష్టారీతిన శ్రమదోపిడీ
- శ్రమకు తగ్గ ఫలితం లేని వైనం
- పట్టని అధికారులు.. కార్మిక చట్టాలకు తూట్లు

5



వరికొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

- నేలలో ఉండే పోషక పదార్థాలు నాశనం!
- పొగతో ప్రాణకోటికి నష్టం
- వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే ఎంతో మేలు

4



సర్వే డాటా ఎంట్రీపై సబ్ కలెక్టర్ ఆరా



డాటా ఎంట్రీపై ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

బషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీని పక్కగా చేపట్టాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీని స్వయంగా పరిశీలించారు. అక్కడున్న ఎంపీవో జయకర్‌తో డాటా ఎంట్రీ ఎంతవరకు పూర్తయిందని ఆరా తీశారు. శనివారంతో వందశాతం పూర్తవుతుందని ఎంపీవో సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు గొట్టిగఖుర్దు జడ్పీహెచ్‌ఎస్, బషీరాబాద్‌లోని స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటన

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 34 గ్రామపంచాయతీలలో నిర్వహించే ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాల ముసాయిదాను శనివారం అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు ప్రకటించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే ఈనెల 12లోపు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని అధికారులు తెలిపారు. 13న అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు. పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురిస్తారు. ఇప్పటికే వార్డులవారీగా ఓటరు తుది జాబితాను కూడా ప్రచురించారు. పంచాయతీల్లో వార్డుకొక పోలింగ్ కేంద్రం ఉంటుంది.



లక్నాపూర్ ప్రాజెక్టు

Sunday Special

ఆహ్లాద క్షేత్రాలు.. ఆదరణకు దూరం!

పాంబండ ఆలయం, లక్నాపూర్ ప్రాజెక్టు, దామగుండం ఆలయానికి సందర్శకుల తాకిడి

ప్రకృతి సౌందర్యంతో గ్రామసీమల మధ్య కనువిందు కలిగించే ప్రదేశాలు ఉన్నా.. అవి ఆదరణకు నోచుకోవడం లేదు. సువిశాల క్షేత్రాలు... కళకళలాడే సెలయేరులు.. పక్షుల కిలకిలారావాలు.. పచ్చని చెట్లు... ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణం ఉన్నా.. అక్కడ కనీస వసతులు లేక పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండలం దామగుండం ఆలయం, కులకచర్ల మండలం పాంబండ దేవాలయం, పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టుల ప్రాంతాలను పర్యాటకులు నిత్యం సందర్శిస్తుంటారు. అయితే వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- కనీస వసతులు లేక పర్యాటకుల తిప్పలు
- పర్యాటక ప్రాంతాలుగా మార్చాలంటూ డిమాండ్

పరిగి, డిసెంబరు 7: దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన పాంబండ శ్రీరామలింగేశ్వర దేవాలయం కూడా పర్యాటకులను ఆకర్షిస్తుంది. కులకచర్ల మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో కిలోమీటరు పొడవు ఎత్తైనా ఒకే ఒక రాయి గుండును కలిగి ఉంది. ఇలాంటి ఏకశిల గురించి దక్షిణ భారత దేశంలోనే గొప్పగా చెప్పుకుంటారు. కొండపై చుట్టు రాతితో మధ్యలో ఉన్న ఈ కోనేరును చూస్తే ఎవరికైనా ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పర్వతానికి ఎదురుగా మరో పర్వతం ఉంది. పూర్వకాలంలో ఈ రెండు కొండలు కలిసి ఉండేవని, అయితే అపరిశుభ్రంగా ఉన్న ఓ వ్యక్తి ఈ కొండపైకి రావడం మూలంగా ఒక సర్పం కొండ మధ్య భాగంలో నుంచి వెళ్లిందని చరిత్ర చెబుతోంది. ఈ కారణంగానే ఈ కొండ రెండు భాగాలుగా చీలిపోయిందని

- మిగతా 5వ పేజీలో..



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

వంతెన నిర్మాణ పనులకు 17 ఏళ్లా!

అయినా పూర్తి కాకపోవడం విచారకరం
మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణ పనులు 17సంవత్సరాల నుండి కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడం విచారకరమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఘట్‌కేసర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఎక్కడైనా రోడ్లు, వంతెనలు కావాలని దీక్షలు, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తారు. కానీ, ఇక్కడ వంతెన పనులను త్వరగా పూర్తిచేయాలని దీక్షలకు దిగడం విచిత్రంగా ఉందన్నారు. బిల్లులు రాక పనులు ఆగిపోవడం దారుణమన్నారు. గతంలో జమ్మికుంటలో, ఘట్‌కేసర్ వంతెనలకు ఒకేసారి అనుమతి లభించాయన్నారు. అయితే, జమ్మికుంటలో పనులు పూర్తయినా, ఇక్కడ పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. బిల్లులు రాక కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లన్న జాతర



బషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొర్విచెడ్ మల్లన్నస్వామి జాతర శనివారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 11గంటలకు కొర్విచెడ్ నుంచి మహిళలు ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం, పరిసరాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉత్సవాలకు స్థానికులతో పాటు తాండూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల భక్తులు, సమీప కర్ణాటక ప్రాంతంలోని పలు గ్రామాల భక్తులు హాజరయ్యారు. బషీరాబాద్ ఎస్సై పి.శంకర్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



మేడ్చల్‌లో మొబైల్ క్యాంటీన్

కడుపు నింపుతున్న కదిలే హోటళ్లు!

హైవేలపై పెరుగుతున్న మొబైల్ క్యాంటీన్లు

- చిన్నపాటి పట్టణాలకూ పాకిన వైనం
- ఎంతో రుచికరంగా వంటకాలు.. ఆదరిస్తున్న జనం..
- మొబైల్ క్యాంటీన్లతో ఎందరికో ఉపాధి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణాల సమయంలో ఆకలిగా ఉందంటే ఏదైనా హోటల్‌కు వెళ్లాల్సి వచ్చేది. హోటల్‌కు వెళ్లాలంటే ఏదైనా పట్టణం వచ్చేదాకా ఆకలితో అలమటించాల్సిందే. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. మనం ప్రయాణించే రోడ్డు పక్కనే ఎన్నో మొబైల్ క్యాంటిన్లు వెలిశాయి. అందులో రకరకాల వంటలు వేడివేడిగా వడ్డిస్తున్నారు. హోటల్స్, రెస్టారెంట్లతో పోలిస్తే ధర కూడా తక్కువగా ఉండడంతో జనం వీటివైపే మొగ్గు చూపుతున్నారు. జనం నుంచి ఆదరణ బాగా పెరగడంతో ఈ మొబైల్ క్యాంటిన్ల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతూ వస్తోంది. పేదలు హోటల్ పెట్టడానికి బిల్డింగ్ కిరాయికీ తీసుకోవాల్సి వస్తుంది. దీనికి అడ్వాన్స్‌లు, రెంట్లు భారీగా ఉండడంతో ఉపాధిగా హోటల్స్‌ను ఎంచుకోవాలనుకున్న వారు నిరాశలో ఉన్నారు. ఇప్పుడు వారు మొబైల్ క్యాంటిన్ల బాట పట్టారు. వీటికి బిల్డింగులు అవసరం లేదు. అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక ఆటోను కొని దానికి కావాల్సిన పరికరాలను అమర్చుకొని రహదారుల వెంట ఆపి అక్కడే వంటకాలు చేసి అమ్ముకుంటున్నారు. పట్టణంలోని హోటల్స్ కంటే రుచికరంగా వంటకాలు ఉండడంతో పాటు ధర కూడా తక్కువగా ఉండడంతో ప్రయాణికులు వారి వాహనాలను ఆపి అక్కడ తృప్తిగా తిని వెళుతున్నారు. దీంతో మొబైల్ క్యాంటిన్‌దారులకు ఆదాయం సమకూరి

- మిగతా 6వ పేజీలో..

రుచికరంగా అందిస్తున్నాం



మొబైల్ క్యాంటీన్‌లు ఇడ్లీ, వడ, దోశ, పూరీలతో పాటు దోశలలో ప్రత్యేక రకాలు కూడా అందిస్తున్నాం. వేడి వేడిగా వడ్డించే మా వంటకాల పట్ల కస్టమర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు టిఫిన్‌లు అందిస్తున్నాం.

- సంతోష్, వంటమాస్టర్

సీటు, మ్యాట్లకింద ఉంచి గంజాయి రవాణా

- 26 కిలోల గంజాయి, కారు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ముఠాను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రాములు




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్

మూడుచింతలపల్లి, డిసెంబరు 7, (ఆంధ్రజ్యోతి) : కారు సీట్లు, మ్యాట్ల కింద గంజాయి ప్యాకెట్లను పెట్టుకొని తరలిస్తున్న ఓ ముఠా శుక్రవారం పోలీసులకు చిక్కింది. దీనికి సంబంధించిన వివరాలను శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ రాములు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ధూల్‌పేట్‌కు చెందిన అనికేశ్ సింగ్ పాత నేరస్తుడు. తక్కువ సమయంలో అధిక సంపాదన లక్ష్యంగా అనికేశ్ సింగ్ రాహుల్ (ప్రస్తుతం జైలులో ఉన్నాడు) ద్వారా ఒడిశా నుంచి అధిక మొత్తంలో గంజాయిని హైదరాబాద్‌కు తరలించేందుకు పథకం పన్నాడు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన గంజాయి స్మగ్లర్ మీనాబాయిని ఫోన్ ద్వారా అనికేశ్ సింగ్ సంప్రదించాడు. వారి మధ్య ఒప్పందంతో హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేయాలనుకున్నారు. పోలీసులతో పాటు చెక్‌పోస్టుల్లో అధికారుల కళ్లుగప్పేందుకు మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన డ్రైవర్ నయన్ దాస్, గీత మండల్, గీత రితి మిస్త్రి, ఓ మైనర్ బాలికతో కలిసి కారులో హైదరాబాద్‌కు ఇక ఫ్యామిలీగా వస్తున్నట్లు కారు తీసుకున్నారు. అందులో ఏడు గంజాయి ప్యాకెట్లు సీట్ల కింద, కాళ్ల కింద, మ్యాట్స్ కింద పెట్టుకుని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. వారు శామీర్‌పేటకు రాగానే వారికి ధూల్‌పేట్‌కు చెందిన అనికేశ్‌సింగ్, రోహిత్, రాజ్‌సింగ్‌లు తోడయ్యారు. వీరు టూ వీలర్‌పై ఆ కారుతో పాటు వస్తున్నారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం రావడంతో మేడ్చల్ జోన్ ఎస్వోటీ, శామీర్‌పేట పోలీసులు వారు ప్రయాణిస్తున్న కారు, బైక్‌లను ఆపి వారిని అదుపులోకి

- మిగతా 6వ పేజీలో..

హ్యాకథాన్లతో విద్యార్థులకు మేధోశక్తి

టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : హ్యాకథాన్ల వల్ల విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతుందని తెలంగాణ అకాడమీ ఫర్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సిన్హా తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీలో శనివారం హ్యాక్ అటాక్ హ్యాకథాన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 24 గంటల పాటు కొనసాగిన హ్యాకథాన్‌ను సందర్శించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కార్యక్రమాలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. హ్యాకథాన్లు విద్యార్థుల మేధోశక్తిని పెంచడంతో పాటు వారికి కోడింగ్‌ని పెంచడం వల్ల నిజ జీవితంలో సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు దోహదపడతాయన్నారు. కళాశాలల్లో నిర్వహిస్తున్న హ్యాకథాన్లలో పాల్గొని నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి 710 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రసంశపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు విజయ్‌కుమార్, ముత్తారెడ్డి, కేఎస్ రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు నితీశశర్మ, వైవీ రెడ్డి, శేఖర్‌రెడ్డి, పృథ్వీరాజ్ గౌడ్, ఆనంద్ బాబు, సౌజన్య, ఆశాలత, రవిరాజు, సాయికృష్ణ, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం



మహిళా శక్తి క్యాంటిన్‌లో తినుబండారాలను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిలు అన్నారు. పరిగి మండల మహిళా సమాఖ్య, సెర్ప్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 60మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంఘానికి రూ.10 లక్షల చొప్పున అందిండమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌలిక వసతుల కల్పన బాధ్యతను మహిళలకే అప్పగించామన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్ నియమానికి గ్రామ సంఘం సిఫారసు ద్వారా నియమించుకోవచ్చని సూచించారు. మహిళలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు అవసరమైన విధానాలను అమలు చేస్తామని మహేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను కూడా త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఏఎంసీ చైర్మన్ బి.పరశురాం రెడ్డి, డీపీఎం రామ్మూర్తి, ఎంపీడీవో ఎంఏ కరీం, ఏపీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ వెంకటయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, కార్యదర్శులు ఎస్.రామకృష్ణ, కె.రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వికారాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఆటో ర్యాలీ నిర్వహించారు. శనివారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.50వేలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఆటో రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రూ.10లక్షల ప్రమాదబీమా కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు యాదయ్య, జంగయ్య, ప్రశాంత్, నర్సింహులు, వెంకట్, రఫీహలీం, మహేందర్, అంజయ్య, రవి, మహేష్, పాండు, మల్లేశం, దర్శన్, రాజీవ్, ఖాదర్, శ్రీనివాస్, ప్రశాంత్, ముజఫర్, సుభాష్, శ్రీకాంత్, ఖలీం, రాజు, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో వరికొయ్యలను కాల్చిన రైతులు

వరికొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

- నేలలో ఉండే పోషక పదార్థాలు నాశనం
- వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే ఎంతో మేలు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వరికోతలు చేపట్టిన తరువాత కొయ్యకాళ్లను కాల్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు తప్పవని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరికొయ్యకాళ్లను కాల్చడం వల్ల వాయుకాలుష్యం ఏర్పడి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. అంతేకాకుండా నేలలోని పోషక పదార్థాలు నాశనమవుతాయి. దాంతో ఆశించిన మేర పంట దిగుబడి రాదు. భూమిలో ఉండే నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రియ పదార్థాలతో పాటు పంటలకు ఉపయోగపడే వానపాములు, ఇతర మిత్రపురుగులు మృత్యువాత పడి రైతులకు నష్టాన్ని మిగులుస్తాయి. భూమిలోని పోషకాలు పెద్దమొత్తంలో కాలి బూడిదై పంటలకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కొయ్యకాళ్లను కాల్చడం వల్ల వెలువడే పొగతో ప్రజలకు ఊపిరితిత్తుల సమస్యతో పాటు అనేక ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతింటుంది. కొయ్యకాళ్లను పొలంలో కలిపి దున్నడం వల్ల సేంద్రియ పదార్థంగా మారి భూమికి సారం పెరుగుతుంది. భూమిలో తేమశాతం నిలుపుదలకు, భౌతిక పరిస్థితిని మెరుగుపడుటకు సాయపడతాయి.

కొయ్యకాళ్లను అస్సలు కాల్చొద్దు



రైతుల కొయ్యకాళ్లను అస్సలు కాల్చొద్దు. ఘట్‌కేసర్ మండలంలోని రైతులకు అవగాహన కల్పించాం. కొయ్యలను కాల్చితే వచ్చే నష్టాలను వివరించాం. కొయ్యలను భూమిలో కలిపి దున్నడం వల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి పెరుగుతుంది. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.

- ఎంఏ బాసిత్, మండల వ్యవసాయాధికారి

ఎస్సీ వర్గీకరణపై ఈనెల 10న విచారణాత్మక అధ్యయనం

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ డిసెంబరు 10న రంగారెడ్డి కలెక్టరేట్‌లో విచారణాత్మక అధ్యయనం చేయనుంది. ఈమేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కొరకు బహిరంగ విచారణ చేయనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ విచారణకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ హాజరవుతున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ ఉప కులాల సంఘం నాయకులు అధికసంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై వినతులు సమర్పించాలని ఆయన కోరారు.

సెలవుపై తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్!

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మందలింపుతో తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ నొచ్చుకున్నారు. ప్రొటోకాల్ విషయంలో తనకు సంబంధం లేకున్నా మహేందర్‌రెడ్డి మందలించారని రవిశంకర్ తన పదవికి రాజీనామకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అనుచరులు రవిశంకర్ ఇంటికి వెళ్లి బుజ్జగించారు. ఆయన కొన్ని రోజులు సెలవుపై వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సెలవు తాత్కాలికమేనని సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేయలేదని డీసీహెచ్‌వో ప్రదీప్ కుమార్ తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై మంత్రి సీతక్క స్పందించాలి

నవాబుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలు, ఎన్‌కౌంటర్లపై మంత్రి సీతక్క స్పందించాలని ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ నాగభూషణం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామం, భావ ప్రకటనా స్వేచ్ఛ పకడ్బందీ అమలుకు అసెంబ్లీలో చర్చ జరిపి ఆచరణలో పెట్టాలన్నారు. పెద్దపల్లి రాణాపూర్ మాదన్నతో పాటు ఏడుగురు ములుగు జిల్లా వాసులపై జరిగిన ఎన్‌కౌంటర్‌పై వెంటనే స్పందించాలన్నారు. అసెంబ్లీలో చర్చ జరిపి బూటకపు ఎన్‌కౌంటర్లను అరికట్టాలని కోరారు.

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించి తగిన న్యాయం చేయాలని సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. సమగ్రశిక్షా ఉద్యోగులు శనివారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు కె.గంగ్యానాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని తెలిపారు. విద్యాశాఖలో అత్యంత క్రియాశీలక విధులను నిర్వహిస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. మెసెంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా సమగ్ర శిక్షా అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వామినారాయణ్ విద్యార్థుల విజయబావుటా

ఐఎన్‌టీఎస్‌వో ఆధ్వర్యంలో నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్



స్వామినారాయణ్ గురుకులం విద్యార్థులు, టీచర్లు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వామినారాయణ్ ఇంటర్‌నేషనల్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలోని శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల హాస్టల్ విభాగానికి చెందిన విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్‌వో) ఆధ్వర్యంలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో విజయదుందుభి మోగించారు. గణిత, భౌతిక శాస్త్రాల్లో విద్యార్థుల పరిజ్ఞానాన్ని అంచనా వేయడానికి రూపొందించడానికి పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకుడు విజయభాస్కర్ తెలిపారు. స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన పరీక్షలో స్వామినారాయణ్ ఇంటర్‌నేషనల్ గురుకుల పాఠశాలకు చెందిన దాదాపు 350 మంది టెస్ట్‌లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. విద్యాసంస్థలకు చెందిన పరమపూజ్య సుఖవల్లభ దాస్‌జీ స్వామిజీ మాట్లాడుతూ.. ఈ జైత్రయాత్రను ఇలాగే ముందుకు సాగించాలని ఆనందం వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులకు స్వామినారాయణ్ భగవాన్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో సతీష్‌రెడ్డి, పరమ పూజ్య విశ్వదర్శన్ స్వామిజీ, విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మేఘం.. మనోహరం



ప్రకృతిలో మార్పు కనిపించింది. గత రెండు రోజులుగా జనం ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం వాతావరణంలో ఏర్పడిన మార్పులతో చల్లని వాతావరణం ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మేఘాలు దర్శనమిచ్చాయి. ఈ దృశ్యం తాండూరులో కనువిందు చేసింది. సాయంత్రం 5.30గంటల ప్రాంతంలో చిరుజల్లులు కురిశాయి. ఆకాశమంతా మేఘావృతమైంది. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



అంతారంలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు మండల పరిధిలోని అంతారం, దస్తగిరిపేట్ గ్రామాల్లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ పనులకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. రైతులకు సంక్రాంతి నాటికి రైతుభరోసా అందిస్తామన్నారు. డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉత్తంచంద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జర్నె నాగప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జర్నప్ప, ఉదయభాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విన్‌టర్ ఫుడ్!

ఆహారం - ఆరోగ్యం

- సరిగా తినండి.. ఆరోగ్యంగా ఉండండి!
- ఈ సీజన్‌లో విటమిన్ సీ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి
- బాదం లాంటి గింజలూ ఆరోగ్యానికి మంచివే
- సూప్‌లకూ స్థానం కల్పించాలంటున్న పోషకాహార నిపుణులు



చలి పెరిగింది.. వాతావరణంలో ఏర్పడిన మార్పువల్ల కూడా ఉదయం వర్షపు జల్లులు, మబ్బులు కమ్ముకొని ఉంటోంది. దీనివల్ల సీజనల్ వ్యాధులతో పాటు జలుబు, దగ్గు బారిన పడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఈ శీతాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు మనం తినే ఆహారంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) సాధారణంగా శీతాకాలంలో చాలా మందికి ఆకలి మందగిస్తుందనే చెప్పొచ్చు. మసాలాలు ఉండే వంటకాలను తీసుకోవడానికి ఎక్కువమంది ఆసక్తి చూపుతుంటారు. కానీ, శీతాకాలంలో ఆరోగ్యం మెరుగుపడాలంటే కూరగాయలు, ఆకుకూరలతో పాటుగా సూప్‌లు, పెరుగు, సీజనల్ పండ్లు లాంటివి ఎక్కువగా తీసుకోవాలని పోషకాహార నిపుణులు సబీనా తెలిపారు. మసాలాలు, వేయించిన ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. ఉదయం అల్పాహారంగా జావ లేదా పాయసం తీసుకుంటే మంచిది. లేదా పండ్లు, బాదం గింజలు లాంటివి తీసుకుంటే శరీరానికి పోషకాలు కూడా లభిస్తాయి.

రోగ నిరోధక శక్తి మెరుగు కోసం..

శీతాకాలంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపర్చుకోవడం చాలా ముఖ్యం. విద్యార్థులు, ఉద్యోగులు తప్పక పాటించాలి. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి.. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

శరీర వెచ్చదనం కోసం..

శీతాకాలంలో ఆరోగ్యంతో పాటు మన శరీరానికి వేడిని కలిగించే పదార్థాలను తీసుకోవాలి. ఖర్జూరాలు, నువ్వులు, పాలు, మాంసం, చేపలు తినడంవల్ల ఆరోగ్యానికి మంచిది. వేర్లతో కూడిన కూరగాయలు బంగాళదుంప, క్యారెట్, ఉల్లిపాయ, వెల్లుల్లి, అల్లం, ముల్లంగి, చిలకడదుంప లాంటివి కూడా తీసుకోవచ్చు. చల్లని కాలంలో శరీరం వెచ్చగా ఉండడానికి నియాసిన్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవచ్చు. గుడ్లు, పాలు, వెన్న, పెరుగు, మజ్జిగలో నియాసిన్ అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులను ఎదుర్కోవాలంటే..

సీజనల్ అంటువ్యాధులతో పోరాడేశక్తి కావాలంటే జింక్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. బచ్చలికూరలో జింక్ సహా పలు రకాల విటమిన్‌లు అధికంగా ఉంటాయి. ఇవి గాక గుమ్మడి విత్తనాలు, నువ్వులు, చేపలు, చికెన్, గుడ్లలో కూడా జింక్ అధికంగా లభిస్తుంది

విటమిన్ సి అధికంగా ఉన్న పండ్లు తీసుకోవాలి..

శీతాకాలం రాగానే జలుబు, దగ్గు, జ్వరం లాంటి సీజనల్ వ్యాధులతో పాటుగా ఫ్లూ కూడా పెరిగే అవకాశం ఉంది. విటమిన్ సీ, బీటా కెరోటిన్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. క్యాబేజీ, గుమ్మడి, దానిమ్మ, బత్తాయి, ఉసిరి, రేగు, స్ట్రాబెర్రీ లాంటి వాటిలో ఈ విటమిన్స్ అధికంగా ఉంటాయి. ఈ సీజన్‌లో కారెట్, బొప్పాయి తింటే మంచిది. ఆకు కూరలు తీసుకోవటం వల్ల ఐరన్ సహా శరీరానికి అవసరమైన విటమిన్స్ అధికంగా లభిస్తాయి.

సూప్‌లు తీసుకోవాల్సిందే..

శీతాకాలంలో ఎలాంటి సూప్‌లు తీసుకోవాలంటే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్న పుదీనా లాంటి హెర్బ్స్‌తో పాటు వెజిటేబుల్ సూప్స్ తీసుకోవచ్చు. వాటికి కాస్త పసుపు, వెల్లుల్లి, మిరియాలు తప్పనిసరిగా జోడించాలి.

నీరు తప్పనిసరి..

ఏ సీజన్‌లో అయినా మంచి నీరు ఎక్కువగా తీసుకుంటే చర్మం కాంతివంతంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. కీరా లాంటివి తీసుకుంటే కొంతమేరకు శరీరానికి అవసరమైన నీటిని భర్తీ చేసుకునే అవకాశం ఉంది.

అక్రమ మైనింగ్‌పై అధికారుల నజర్

ఎక్మాయి శివారు నాపరాళ్ల గనుల్లో తవ్వకాల నిలిపివేత

లీజులు లేకుండా తవ్వితే కఠిన చర్యలు : తహసీల్దార్



ఎక్మాయి శివారులోని నాపరాతి గనుల్లో కటింగ్ మెషీన్ బెల్టులను తొలగింపజేస్తున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా చేపడుతున్న నాపరాళ్ల తవ్వకాలపై రెవెన్యూ అధికారులు నజర్ పెట్టారు. శనివారం బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎస్సై పి.శంకర్, సిబ్బందితో కలిసి మండలంలోని ఎక్మాయి శివారు సర్వే నంబర్ 147లోని నాపరాళ్ల గనుల్లో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుపడాన్ని తహసీల్దార్ స్వయంగా గుర్తించారు. అక్కడున్న వ్యక్తులను లీజు పత్రాలు చూపించాలని కోరగా నీళ్ల నమిలారు. దాంతో తహసీల్దార్ సీరియస్‌గా స్పందిస్తూ అక్రమ తవ్వకాలకు జరుపుతున్న గనుల్లో కటింగ్ మెషీన్ బెల్టులను తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అక్కడున్న వారితో నాపరాళ్ల తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు. ఈక్రమంలోఅక్రమ తవ్వకాలకు సంబంధించి తహసీల్దార్ ఎదుట కొందరు గొడవకు దిగగా.. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. ఇకపై అక్రమ తవ్వకాలు జరిపితే అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దార్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇదిలా ఉండగా అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులకు ఇదంతా తెలిసినా.. ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు స్థానికంగా వినిపించాయి.

డాక్టర్ శ్రీదేవికి ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు



కిషన్‌రెడ్డి నుంచి ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు అందుకుంటున్న డా.శ్రీదేవి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లో ఎన్టీఈపీ కార్యక్రమాన్ని సమవర్ధవంతంగా అమలు చేసినందుకుగాను డాక్టర్ శ్రీదేవి శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ ప్రో గ్రామ్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ల సమీక్ష సమావేశాన్ని శనివారం ఎర్రగడ్డలోని టీబీ శిక్షణ ప్రదర్శన కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో ఉత్తమ ప్రదర్శన చేసిన ప్రోగ్రామ్ ఆఫీసర్‌లను అవార్డుతో సత్కరించారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి, జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది డాక్టర్ శ్రీదేవిని అభినందించారు.

ఘనంగా సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలు



కావడి నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయం అయ్యప్పస్వామి, సుబ్రమణ్యేశ్వరుడి నామస్మరణతో మార్మోగింది. శనివారం సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పమాలధరణ భక్తులు సుబ్రమణ్యేశ్వరస్వామి వారి కావడి నిర్వహించారు. ఈమేరకు పట్టణ కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు, అయ్యప్ప మాలధరణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ నిర్మానానికి శంకుస్థాపన

కందుకూరు : మండటంలోని తిమ్మాపురం గ్రామంలో నల్లపోచమ్మ ఆలయానికి శనివారం శంకుస్థాపన చేశారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామ మాలసంఘం నాయకులు పునర్నిర్మాణం చేసేందుకు నిధులు సేకరించినట్లు నిర్వాహకుడు రామ్‌వంశీ తెలిపారు. త్వరలో ఆలయాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగమ్యగోచరం.. కార్మికుల జీవితం

- కాంట్రాక్టర్ల చేతిలో చితికిపోతున్న శ్రమజీవులు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పరిశ్రమల్లో ఇష్టారీతిన శ్రమదోపిడీ
- రెక్కలు ముక్కలు చేసినా.. శ్రమకు తగ్గ ఫలితం లేని వైనం
- పట్టని అధికారులు.. కార్మిక చట్టాలకు తూట్లు



పని కోసం వేచిచూస్తున్న కార్మికులు(ఫైల్)

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయంత్రం వరకు రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేసినా.. అవసరాలు తీరవు.. బతుకు బండి ముందుకు సాగదు. ఉన్న ఊరిలో పూట గడవని పరిస్థితి. ఊరుకాని ఊరికొచ్చి పనిచేసినా మారని దుస్థితి. అయినా, పిడికెడు అన్నం కోసం ఏదో ఒక పరిశ్రమలో కాంట్రాక్టు లేబర్‌గా పనిలో చేరి శ్రమ దోపిడీకి గురువుతున్న వారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎందరో ఉన్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని రేయింబవళ్లు పని చేస్తూ జీవనం సాగిస్తున్న వేలాది మంది కార్మికుల జీవితాలు కాంట్రాక్టర్ల చేతిలో చితికిపోతున్నాయి. శ్రమజీవుల కష్టాల గురించి ఊసెత్తే నాథుడే కరువయ్యాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరానికి చేరువలో ఉన్న మేడ్చల్ జిల్లా పరిశ్రమలకు పెట్టింది పేరు. జిల్లాలో దాదాపు 35 ఏళ్ల క్రితం ప్రారంభమైన పారిశ్రామిక రంగం అంచలంచెలుగా ఎదుగుతూ నేడు వేలాది పరిశ్రమలకు చేరుకుంది. ఇందులో చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలే కాకుండా ఇతర వాణిజ్యపరమైన వ్యాపార సంస్థలు కూడా ఉన్నాయి. జిల్లాలో ఉన్న పరిశ్రమలు నేరుగా కార్మికులను తమ సంస్థలో చేర్చుకోకుండా కాంట్రాక్టర్ల ద్వారా పనుల్లో పెట్టుకునే విధానానికి అలవాటుపడ్డాయి. దాంతో ఇక్కడ ఉన్న పరిశ్రమల్లో దాదాపు 85-90వేల మంది కార్మికులకు వివిధ స్థాయిల్లో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా వీరిలో అన్‌స్కిల్డ్ (ఎలాంటి నైపుణ్యంలేని వారు లేబర్ కేటగిరీ), స్కిల్డ్(నైపుణ్యత కలిగిన), సెమీస్కిల్డ్(కొద్దిపాటి నైపుణ్యత గలవారు), హెవీస్కిల్డ్(పూర్తి నైపుణ్యత గలవారు) కార్మికులుగా విభజించి పనుల్లో పెట్టుకుంటారు. కాగా, అన్‌స్కిల్డ్, స్కిల్డ్ కార్మికులను కాంట్రాక్టు పద్దతిలో పనుల్లో పెట్టుకుని మిగతా రెండు రకాల కార్మికులను నేరుగా పరిశ్రమలు భర్తీ చేసుకుంటున్నాయి. దాదాపు 60 వేల మంది అన్‌స్కిల్డ్ కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో ఇక్కడి పరిశ్రమలు పనుల్లో పెట్టుకుంటున్నాయి. దాంతో ఇక్కడ కార్మికులకు డిమాండ్ పెరగడంతో వారిని సమకూర్చే సంస్థలు పుట్టగొడుగుల్లా వెలిసి నిరుపేదల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నాయి. కాంట్రాక్టు పద్దతిలో పనుల్లో చేరే కార్మికుల సంక్షేమం ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. కాంట్రాక్టు లైసెన్స్ పొందిన సంస్థ పనితీరును పరిశీలించి ప్రతీనెల కార్మికుల సంక్షేమం గురించి కల్పించిన ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లిస్తున్నారా? లేదా! అనే విషయాల గురించి పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టు పద్దతిలో పనుల్లో చేరే కార్మికుల సంక్షేమం గురించి పూర్తి బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంటుంది. అలాగే ప్రతీనెల వేతనం సక్రమంగా చెల్లించటంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్‌లను కూడా కాంట్రాక్టరు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇక్కడ పరిశ్రమల్లో ఉన్న కొందరు కాంట్రాక్టర్లు కార్మికులకు నెలవారి చాలీచాలని వేతనంతోనే సరిపెడుతున్నారు. పరిశ్రమల్లో కాంట్రాక్టు పద్దతిలో కార్మికులను పెట్టే సంస్థల్లో చాలావాటికి కార్మికశాఖ అనుమతులు కూడా ఉండకపోవటం గమనార్హం. ఉన్నవారు లైసెన్స్ రెన్యూవల్ చేయించకుండా వ్యాపారాన్ని నడుపుతున్నారు. ఒక పరిశ్రమలో కాంట్రాక్టు లేబర్లను పెట్టుకోతలచినవారు సంబంధిత శాఖతో అనుమతి పొందాల్సి ఉంటుంది. కార్మికశాఖ అనుమతి పొందిన సంస్థలు ఎంతమంది కార్మికులను సమకూర్చగలరన్న విషయాన్ని ముందుగా తెలపాల్సి ఉంటుంది. 50మందికి అనుమతి పొంది ఉంటే.. అంత మందినే పనుల్లో పెట్టుకోవాలి. కాగా, ఇక్కడి పరిశ్రమల్లో 50మందికి అనుమతి పొంది ఉన్న సంస్థలు 500 మంది కార్మికులను పనుల్లో పెట్టి తమ వ్యాపారాన్ని నడుపుతున్నాయి. కాంట్రాక్టు లైసెన్స్ ఉన్నవారు ఒకే పరిశ్రమలో కార్మికులను పెట్టుకోవాలి. ఇక్కడ ఉన్న కొన్ని సంస్థలు ఒకే లైసెన్స్‌పై 5 నుంచి 6 పరిశ్రమల్లో కార్మికులను పనిలో పెట్టుకుంటున్నాయి. సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా నెలనెలా మామూళ్లకు అలవాటుపడి కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు!

జిల్లాలో మేడ్చల్, బాలానగర్, చర్లపల్లి, ఈసీఐఎల్ తదితర ప్రాంతాలతో పాటు నగరశివారులోని ప్రాంతాల్లో పెద్దఎత్తున గోదాముల్లో ఉన్న పరిశ్రమల్లో లేబర్ కాంట్రాక్టు పద్దతిలో పనిచేస్తున్న కార్మికుల్లో చాలామంది స్థానికేతరులు, బిహార్, ఒడిషా తదితర రాష్ట్రాలకు చెందినవారే. అంతేకాకుండా ఏపీలోని శ్రీకాకుళం, తెలంగాణలోని పలు జిల్లాలకు చెందినవారూ ఉన్నారు. ఇక్కడ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయటం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. పరిశ్రమల యాజమాన్యాల నుంచి 8గంటల పనికిగాను ఒక్కో కార్మికుడు రోజువారీగా రూ.500-600 తీసుకుంటున్నారు. కార్మికులకు మాత్రం రూ.300-400 వరకు చెల్లిస్తున్నారు. దీనికితోడు 8 గంటలకు బదులుగా రెండు గంటలు అదనంగా పని చేయించుకొని ఆ డబ్బులు కూడా కాంట్రాక్టర్లే ఉంచుకుంటున్నారు. దాంతో ప్రతీ కార్మికుడి నెల వేతనంలో రూ.6000-9000 వరకు కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. పరిమితికి మించి కార్మికులను పరిశ్రమల్లో పెట్టుకుని వారి కష్టార్జితాన్ని సొమ్ము చేసుకుంటున్నా లేబర్ కాంట్రాక్టు సంస్థల గురించి పట్టించుకునే నాథుడే లేడు. కాగా, సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నందునే ఈ పరిస్థితి దాపురించిందని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. శ్రమ దోపిడికీ గురవుతున్న వారిలో చాలామంది మహిళా కార్మికులు ఉన్నారు.

కార్మిక శాఖ అధికారుల వైఫల్యం



లేబర్ కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన సంబంధిత కార్మికశాఖ అధికారుల వైఫల్యం కారణంగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో పనిచేసే కార్మికులకు నెలవారి కనీస వేతనం రూ.12,300 ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, కాంట్రాక్టర్లు కనీసం రూ.9,000 కూడా చెల్లించటం లేదు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు సక్రమంగా కట్టకపోవటంతో ప్రమాదానికి గురైన కార్మికులకు వైద్యసేవలు అందటం లేదు. కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకుని పనులు చేయిస్తున్నారు. **- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్**

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



పరిశ్రమలో పనిచేసే కార్మికులతో 10గంటలు పని చేయిస్తూ.. 8గంటలకే వేతనం చెల్లిస్తున్నారు. అదనంగా పనిచేసిన వేళలకు సంబంధించిన వేతనం గురించి నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా పనుల నుంచి తొలగిస్తున్నారు. ఒక్కో కార్మికుడి వేతనంలో నెలకు వెయ్యి నుంచి రెండు వేల వరకు కాంట్రాక్టర్లు వసూలు చేసి కనీసం ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు కూడా కట్టడం లేదు. తమ హక్కుల గురించి నిలదీస్తే పనుల నుంచి తొలగించటంతో పాటు ఇతర పరిశ్రమల్లో కూడా పని దొరక్కుండా చేస్తున్నారు. **- శేఖర్, కార్మికుడు**

ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు హాంఫట్!

చాలావరకు లేబర్ కాంట్రాక్టర్లు తమ వద్ద ఉన్న కార్మికుల సంక్షేమం కోసం ప్రతీనెల చెల్లించే ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులను మింగేస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ప్రతీనెల కార్మికుని వేతనం చెల్లించటంతో పాటు అతని సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పించిన ఈఎస్‌ఐ, పీఎఫ్‌ల చెల్లింపు బాధ్యత కూడా సదరు కాంట్రాక్టరుపై ఉంటుంది. కాగా, ఇక్కడ ఉన్న కాంట్రాక్టర్లు చాలావరకు ఈ నిబంధనను పాటించటం లేదు. పరిశ్రమలో పనిచేసే వేళ కార్మికుడు ఏదైనా ప్రమాదానికి గురైన వేళ అతని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తే ఈఎస్‌ఐ చెల్లించలేదన్న విషయం బట్టబయలవుతోంది. దాంతో కార్మికులు ప్రమాదానికి గురైన వారిని ఆదుకోవాలని యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకొచ్చినా యాజమాన్యాలు మాత్రం తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి యువకుడు ఆత్మహత్య

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మండలం, పీరంపల్లి గ్రామానికి చెందిన బండెన్నోళ్ల పోషిరెడ్డి(30) గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మద్యే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డాడు. ముందుగా మీరు కొన్ని డబ్బులు చెల్లిస్తే 10రెట్లు డబ్బు మీకు లోన్ రూపంలో వస్తుందని నమ్మబలకడంతో ముందుగా రూ.37,000 చెల్లించిన పోషిరెడ్డికి అనుకున్నట్లుగా లోన్‌రాలేదు. పైగా మరికొన్ని డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో ఆవేదనకు గురైన పోషిరెడ్డి పొలం వద్ద పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని వికారాబాద్ మిషన్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బతికే అవకాశం లేదని చెప్పడంతో ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో పోషిరెడ్డి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం సరికాదు

- సోషల్ మీడియాలో పోస్టులపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ రూరల్/చౌదరిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత మంది వ్యక్తులు బలహీన వర్గానికి చెందిన ఎమ్మెల్యే శంకర్‌పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనని మాటలను అన్నట్టు సోషల్ షోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకొని, దుష్ప్రచారం పునరావృతం కాకుండా కట్టడి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీనునాయక్, పి.రాజేష్‌గౌడ్, నాగి సాయులు, అనీల్, జాంగారి రవి, నెహ్రూనాయక్, యాదయ్య తదితరులు ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే శంకర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కొందుర్గు మండల కాంగ్రెస్ నాయకులు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్లలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో జిల్లేడ్ చౌదరిగూడలో రవికుమార్, చందునాయక్, వెంకటేష్, కొందుర్గులో లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, మాణెయ్య పెంటయ్య, శ్రీను, వేణుగోపాల్, రమేష్‌లు ఉన్నారు.

యువ నాయకులే పార్టీకి పట్టుగొమ్మలు



యూత్ కాంగ్రెస్ నాయకులను శాలువా కప్పుత్తున్న డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువ నాయకులే కాంగ్రెస్‌కు పట్టుగొమ్మలని పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డ ఎర్రోళ్ల సంతోష్ శనివారం హరివర్ధన్‌రెడ్డిని మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. కొత్తగా పదవులు పొందిన యువ నాయకులు పార్టీకోసం పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి యువకులు ప్రచారం చేయాలన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని యువ నాయకులు తమ కార్యకలాపాలు చేపట్టాలని కోరారు.

అన్నివర్గాలకు శ్మశానవాటికల ఏర్పాటు



పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు వేర్వేరుగా శ్మశానవాటికల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. శనివారం 6వ వార్డులోని సుల్తాన్‌నగర్‌లో ఎస్సీల శ్మశానవాటిక నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసుకునే శ్మశాన వాటికల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకోవాలని సూచించారు. అందులో నీటి వసతి కూడా కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బి.నాగేశ్వర్‌రావు, టి.వెంకటేశ్, జె.శ్రీనివాస్, నాయకులు మొగులయ్య, భీమన్న, యాదయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్లాద క్షేత్రాలు.. ఆదరణకు దూరం!

ఏకశిల పర్వతంపై వెలసిన పాంబండ రామలింగేశ్వరస్వామి దేవాలయం



(3వ పేజీ తరువాయి)

ఇక్కడి ప్రజల నమ్మకం. క్షేత్రం ఉన్న పర్వతం సుమారు మూడు కిలో మీటర్ల విస్తీర్ణం మేరకు పాము ఆకారంలో ఉంది. ఏకశిల పర్వత(పాంబండ) క్షేత్రంపై వెలసిన ఈ కోనేటిలో స్నానమాచరిస్తే సర్వరోగాలు మాయమవుతాయని స్థానిక ప్రజలు విశ్వాసం. కోనేటి నీటిని పంట పొలాల్లో చల్లుకుంటే అధిక దిగుబడి వస్తుందని ఇక్కడి రైతులు నమ్ముతారు.



కొండలు, కోనల మధ్య ఉన్న దామగుండం సెలయేరు

దామగుండం ఆలయానికి ఘన చరిత్ర

దట్టమైన అడవులు, ఎత్తైన కొండల మధ్య ఏడాది పొడువునా పారే సెలయేరు ఇక్కడి ప్రజలను ఎంతో ఆకట్టుకుంటోంది. ఇది పూడూర్ మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ దామగుండం పుణ్య క్షేత్రానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులను అలరిస్తుంది. చుట్టూ ఉన్న ఎత్తైన కొండలు, గుట్టలు, చెట్లు ఈ ప్రాంతానికి వచ్చే వారిని మంత్ర ముగ్ధులను చేస్తాయి. ఇలాంటి సుందరమైన ప్రాంతాన్ని ఒక్కసారైనా సందర్శించాలనే తపన ఇక్కడి వారిలో కలుగుతుంది.

'లక్నాపూర్'కు సందర్శకుల తాకిడి

పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టు వందల ఎకారల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. ఈ ప్రాజెక్టు నిండా నీటితో కళకళలాడితే ఎంతో అందంగా కనువిందు చేస్తుంది. ప్రాజెక్టు కట్ట, అలుగు, తూము తదితర ప్రాంతాలు పర్యాటకులను అకట్టుకుంటున్నాయి. ఈ ప్రాజెక్టును సందర్శించేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు, దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని సైతం ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా మారిస్తే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

800 ఏళ్ల చరిత్ర


ఈ క్షేత్రానికి సుమారు ఎనిమిది వందల ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని పురాణాల ద్వారా తెలుస్తుంది. పూర్వం ఒక మునీశ్వరుడు దాదాపు 800 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో తపస్సు ఆచరించాడనే ప్రతీతి. ఈ ఆలయం ఉత్తరం వైపున ఉన్న గుహలో ఆయన తపస్సు చేసినట్లు చెప్పుకుంటారు. ఈ గుహ ఇప్పటికి ఉంది. దామగుండం ఆలయానికి సమీపంలోనే ఓ పుష్కరిణి కూడా నిర్మించారు. ఈ పుష్కరిణిలో స్నానమాచరిస్తే ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయనేది ఇక్కడి భక్తుల విశ్వాసం. పరిగి, వికారాబాద్, తాండూర్, చేవెళ్ల నియోజకవర్గాల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు.

లక్నాపూర్‌లో బోటింగ్ ఏర్పాటు చేయాలి



పరిగి ప్రాంతానికి తలమానికంగా నిలుస్తున్న లక్నాపూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలి. నిత్యం అనేక మంది పర్యాటకులు ఈ ప్రాజెక్టును సందర్శిస్తుంటారు. బోటింగ్‌ను కూడా ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **- ఎ.రవి,పరిగి**

పర్యాటక కేంద్రాలుగా మారుస్తాం



పరిగి ప్రాంతంలో వీలుగా ఉన్న అన్ని ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మారుస్తాం. మొదటగా లక్నాపూర్ ప్రాజెక్టును పర్యాటకంగా మారుస్తాం. ఇక్కడ బోటింగ్‌కు ఏర్పాటు చేశారు. పాంబండతో పాటు, ఇతర ప్రాంతాలకు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. **- డా. టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి**

గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేది వరకు గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అన్ని అర్హతలు ఉన్న గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించకుండ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు. తలకొండల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 37వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. దీక్షలో నాయకులు కృష్ణయ్య, గౌస్, చెన్నయ్య, నాగయ్య, సత్తయ్య, బాలయ్య, నవీన్, మల్లయ్య రాములయ్య, జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్, శరత్ చంద్ర తదితరులు ఉన్నారు.

అరిస్టాటిల్ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్ డే



మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలుకూరు పరిధిలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఫ్రెషర్ డే ఘనంగా జరిగింది. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు తోటివారిని పరిచయం చేసుకున్నారు. కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చీఫ్‌మినిస్టర్ కప్-2024పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామ స్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు మండల స్థాయి అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. గ్రామస్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారు. గ్రామస్థాయిలో గెలుపొందిన జట్లు, క్రీడాకారులు మండల స్థాయిలో పాల్గొననున్నారు. నేటి(ఆదివారం) వరకు గ్రామస్థాయిలో ఈ పోటీలు కొనసాగుతాయి. మండలస్థాయిలో మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 10, 11, 12వ తేదీల్లో మండల స్థాయిలో కొనసాగనున్నాయి. మండల స్థాయిలో 14క్రీడా అంశాల్లో పోటీలు జరుగుతాయి. గెలుపొందిన క్రీడాకారులు, జట్లు, జిల్లా స్థాయికి పోటీల్లో పాల్గొంటారు. జిల్లా స్థాయిలో ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కొనసాగుతాయి.

నిర్వహణ బాధ్యతలు అప్పగింత

గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా పీఈటీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. మండల స్థాయిలో మండల స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా ఎంపీడీవో, మెంబర్ కన్వీనర్‌గా పీడీ, పీఈటీలు ఇన్‌చార్జిగా కొనసాగుతారు. క్రీడాకారులకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. సీఎం కప్ పోటీల నిర్వహణలో స్పోర్ట్స్ అథారిటీ ప్రత్యేక నిధులను కేటాయించనుంది. మండల స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపీడీలు ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి అనుబంధంగా ఉన్న మండలంలో మండల అధికారులు కలిసి పోటీలను నిర్వహిస్తారు.

10న సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఈనెల 10న తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపడుతున్నట్లు జాతీయ బీసీకార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.కోటితో డ్రైనేజీ పనులకు శ్రీకారం

- హౌజింగ్ బోర్డు కాలనీలో పనులు
- రాకపోకల నిలిపివేత
- రూట్ డైవర్షన్‌కు అధికారుల సర్వే
- దుకాణాలు రైతుబజార్‌కు తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మేడ్చల్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న మేడ్చల్ హౌజింగ్ బోర్డు కాలనీ ప్రధాన రోడ్డు డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి ప్రత్యే చొరవతో రూ.కోటి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు సోమవారం(రేపు) పనులు ప్రారంభించనున్నారు. కాగా 'గుంతలు పూడ్చేదెప్పుడో?' అనే శీర్షిక శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డీఈఈ విజయలక్ష్మి, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్‌గౌడ్‌లతో కలిసి శనివారం జాతీయరహదారి నుంచి హౌజింగ్‌బోర్డు మీదుగా వెళ్ళే రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించారు. మేడ్చల్ తుమ్మ చెరువు నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ మీదుగా వివేకానంద చౌరస్తా ఎస్‌బీఐ వరకు శథిలావస్థలో ఉన్న పైప్‌లైన్‌ను పరిశీలించారు. ప్రస్తుతం పీటున్నర ఉన్న డ్రైనేజీ పైప్ లైన్‌ను తొలగించి దానిస్థానంలో మూడు ఫీట్ల పెద్ద పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

హౌజింగ్ బోర్డు ప్రధాన రోడ్డు మూసివేత

ప్రస్తుతం హౌజింగ్‌బోర్డు ప్రధాన రోడ్డులో డ్రైనేజీ పనులు పూర్తయ్యే వరకూ రోడ్డుపై రాకపోకలను నిషేధించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్‌గౌడ్‌లతో కలిసి ప్రత్యామ్నాయ మార్గం కోసం సర్వే నిర్వహించారు. ప్రస్తుతం వివేకానంద చౌరస్తా నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ మీదుగా రైల్వేస్టేషన్ వెళ్లే వాహనాలను వివేకానంద చౌరస్తా నుంచి పాత జాతీయ రహదారి మీదుగా మహవీర్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ చేరుకునే వీలు కల్పిస్తున్నారు. కాగా పాత జాతీయ రహదారి మధ్య ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారులను మార్కెట్ కమిటీ రైతుబజార్‌కు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు వ్యాపారస్తులతో అధికారులు చర్చలుజరిపారు. సోమవారం నుంచి వ్యాపారస్తులు పాతజాతీయ రహదారిపై నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా దుకాణాలు ఏర్పాటు చేయరాదని అదేశాలు జారీచేశారు. పనులు పూర్తయ్యేంత వరకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఈ సందర్భంగా కోరారు.



ట్రాఫిక్ పోలీసులతో కలిసి హౌజింగ్ బోర్డు రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

క్రైం కార్నర్

గంజాయి విక్రేతలు, వినియోగదారుల రిమాండ్

కీసర రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హోలీ మేరీ కళాశాల వద్ద అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య శనివారం ఘట్‌కేసర్ ఎక్సైజ్, కీసర పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్‌కు చెందిన సమీర్‌కుమార్ సిన్హా, ఒడిషాకు చెందిన బిష్ణుప్రధాన్(విష్ణు) నుంచి కొనుగోలు చేసిన గంజాయిని 10గ్రాముల ప్యాకెట్లుగా విభజించి రూ.600నుంచి రూ.800లకు విక్రయిస్తున్నారు. ఇందుకు గానూ ఆకుల కిషోర్ అనే తన మిత్రుడి ద్వారా విద్యార్థులకు, సమీప ప్రాంత యువకులకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు దిగారు. మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామానికి చెందిన వట్టెల సాయికుమార్, సినీగల్ల చింటులు కీసర మండలం బోగారంలోని సుచిరిండియా వెంచర్ వద్ద సమీర్‌కుమార్ సిన్హా, ఆకుల కిషోర్ వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు చేరుకోగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 1కేజీ 90గ్రాముల గంజాయి, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, వినియోగిస్తున్న కీసర మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన సుమారు 12మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారందరిని న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, చెముడు మండలం కొత్తవీధికి చెందిన చెల్లూరి శ్రీనివాస్ రావు(25) పోచారంలో అద్దెకు ఉంటూ కారు డ్రైవింగ్ చేస్తుంటాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండేవాడు. కుటుంబానికి చెందిన ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో పోస్టులు పెట్టి బాధపడుతుండేవాడు. ఈనెల 6వ తేదీన రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరుసటి రోజు గమనించిన ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని వేర్వేరు కాలనీలో ఉండే ఇద్దరు(17) బాలికలు ఘట్‌కేసర్ పట్టణంలో ఓ దుకాణంలో పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే ఈనెల 6న ఇంటి నుంచి దుకాణానికి బయలుదేరి వెళ్లారు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు తెలిసిన వారిని, మిత్రులను, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెరువులో మునిగి గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని డబిల్‌పూర్ గ్రామ పెద్ద చెరువులో శుక్రవారం చేపలు పట్టడానికి వెళ్లిన రాజేందర్ బారిక్(25) అనే యువకుడు చెరువలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. కాగా శనివారం మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుచిత్ర నివాసి సామల రవితేజ(24) శుక్రవారం రాత్రి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మేడ్చల్ పట్టణంలోని క్లాజిక్ దాబా వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రవితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీటు, మ్యాట్లకింద పెట్టి గంజాయి రవాణా

(3వ పేజీ తరువాయి)

తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా దాదాపు రూ. 15 లక్షల విలువ చేసే ఎండు గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో గంజాయితో పాటు వానిరి అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ దాడిలో ఓడి02పీ7844 ఫోర్డ్ ఫీగో కారు, ఏపీ09సీటీ2544, టీఎస్13ఈక్యు3722 నంబర్ గల ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్ ఫోన్లతో పాటు 26 కిలోల గంజాయి, గంజాయిని తరలిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మీనాబాయి ఆదేశాల మేరకు ఈ స్మగ్లర్లు దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తె లుస్తుందన్నారు. గంజాయిని తరలిస్తున్న వారితో పాటు నగరంలో గంజాయి విక్రయించే నేరస్తులను కూడా పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనాథ్, డీఐ గంగాధర్, ఎస్‌వోటీ సీఐ శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్సైలు హారిక, పరుశురామ్, దశరథ్ పాల్గొన్నారు.

అనంతరెడ్డి సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అనంతరెడ్డి సేవలు ఎంతో ప్రశంసనీయమని జిల్లా విద్యాధికారి జి.రేణుకాదేవి అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన శివారెడ్డిపేట్ జీహెచ్‌ఎం, డీసీఈబీ కార్యదర్శి అనంతరెడ్డి అభినందన సభ డీఈవో కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ అనంతరెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల పాఠశాల కాంప్లెక్సు విధులతో పాటు డీసీఈబీ కార్యదర్శిగా విధులను సమర్థవంతంగా పూర్తి చేసేవారని ఆమె గుర్తు చేశారు. అనంతరం పలువురు అనంతరెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్‌బీ కార్యదర్శి అత్తెల్లి వీరకాంతం, ఎంఈవో బాబుసింగ్, జీహెచ్‌ఎంలు పాండు, శ్రీశైలం, కృష్ణారెడ్డి, ఏఎంవో రామ్ మస్తా, డీసీఎస్‌బీ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల ప్రవర్తనపై బషీరాబాద్ పోలీసుల నిఘా

బషీరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రౌటీషీటర్లు, పాతనేరస్తుల ప్రవర్తనపై పోలీసు నిఘా పెంచారు. ఈ క్రమంలో బషీరాబాద్ ఎస్‌ఐ పి.శంకర్ శనివారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వారిని పిలిపించి విచారణ జరిపారు. మండలంలో 24మంది ఉండగా, ప్రస్తుతం ఎవరెవరు ఏ వృత్తిలో ఉన్నారానే దానిపై ఆరాతీశారు. అనంతరం ఎస్‌ఐ మట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీసు నిఘా ఉంటుందని, ఎప్పటికప్పుడూ మీ నడవడికను పరిశీలిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు విరాళం

తాండూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు మండల బీసీసెల్ అధ్యక్షుడు ఆర్సీగౌడ్ రూ.లక్షా 11వేల విరాళం అందజేశారు. మండలంలోని మల్కాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు కోసం గ్రామ శివాజీ యువజన సంఘం నాయకులు శనివారం బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్సీ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన విరాళాన్ని నగదు రూపంలో సంఘం సభ్యులకు అందజేశారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

వికారాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి గొట్టిముక్కులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సర్వోదయమిత్ర మండలి ట్రస్ట్ సభ్యుడు కన్నె అశోక్ శనివారం సైకిళ్ల పంపిణీ చేశారు. హెచ్‌ఎం శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వేమారెడ్డి, రతన్, మహేందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ జనాభా పంచాయతీలో నమోదయ్యేలా చూడాలి

బషీరాబాద్, డిసెంబరు 7: కొర్విచెడ్‌ఘని అనుబంధ గ్రామం కొత్తగా పంచాయతీగా ఏర్పడినప్పుడు, ఇక్కడి బీసీ జనాభా(ఓటర్ల)ను, ఉమ్మడి పంచాయతీ కొర్విచెడ్‌లో కలిపారు. దీంతో పంచాయతీకి నిధులు రాక, అభివృద్ధి జరగక పాలకులు ఇబ్బందులు పడుతున్నారని నవాంద్గి సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఏఎంసీ సభ్యులు వడ్డే హన్మంతు శనివారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు రాబోతున్నాయని, ఇకనైనా అక్కడి ఓటర్లను కొర్విచెడ్‌ఘని పంచాయతీకి సర్దుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇందుకు సబ్‌కలెక్టర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కడుపు నింపుతున్న కదిలే హోటళ్లు!

(3వ పేజీ తరువాయి)

వారి కుటుంబాలు హాయిగా ఉంటున్నాయి. ప్రయాణికులలు మార్గమధ్యంలో ఆకలైతే ఎలా అన్న అనుమానాలు కూడా లేవు. ఎక్కడ ఆకలైతే అక్కడ ఈ క్యాంటిన్లలో తిని వెళుతున్నారు. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనాల వరకు ఈ క్యాంటిన్లలో లభిస్తున్నాయి. దీనికి తోడు కస్టమర్లకు కావాల్సిన అన్ని రకాల వెజ్, నాన్‌వెజ్ వంటకాలు కూడా తక్కువ ధరల్లో లభిస్తుండడంతో వారు ఎంతో ఇష్టంగా తింటున్నారు. మేడ్చల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇవి పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. వండిన వంటకాలను ఓ వాహనంలో తీసుకొచ్చి జన సంచారం ఎక్కువగా ఉండే జాతీయ రహదారుల పక్కన ఆపి ప్రయాణికుల ఆకలి తీర్చుతున్నాయి. మేడ్చల్ జిల్లా ప్రాంతం పారిశ్రామిక, వాణిజ్య పరంగా కాకుండా కళాశాలల పరంగా పెద్ద ఎత్తున అభివృద్ధి చెందింది. జిల్లాలో మేడ్చల్‌లో ఎన్‌హెచ్ - 44, శామీర్‌పేట్‌లో రాజీవ్‌రహదారి, ఘట్‌కేసర్‌లో వరంగల్ జాతీయ రహదారులున్నాయి. దీంతో ఇక్కడ ఉన్న హోటళ్లకు, రెస్టారెంట్ దాబాలకు ఉదయం, మధ్యాహ్నం వేళ పెద్ద ఎత్తున గిరాకీ ఉంటుంది. ఇది దృష్టిలో పెట్టుకుని కొందరు మొబైల్ క్యాంటిన్లను ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. మేడ్చల్ జాతీయరహదారి వెంబడి సుచిత్ర నుండి మొదలుకుని కొంపల్లి, సీఎంఆర్ కళాశాల, కేఎల్‌ఆర్ వెంచర్, ఐటీఐ, కాళ్లకల్, తూప్రాన్, రామాయంపేట, శామీర్‌పేట రాజీవ్ రహదారిలో అల్వాల్ నుండి మొదలుకుని సిద్దిపేట వరకు, ఘట్‌కేసర్ రహదారిలో ఉప్పల్ నుండి వరంగల్ వరకు ఈ మొబైల్ క్యాంటీన్‌లు నడుస్తున్నాయి. సామాన్యంగా హోటల్, రెస్టారెంట్‌లో భోజనం చేస్తే ఒకరికి రూ.100 నుండి రూ. 300 వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ మొబైల్ క్యాంటీన్‌లో రూ.30కే భోజనం లభిస్తుండడంతో ప్రయాణికులు కూడా వీటిపై ఆదరణ చూపుతున్నారు.

ఆదరణ బాగుంది



దాదాపు పదేళ్లుగా మొబైల్ క్యాంటీన్ నడుపుతున్నాను. వాహనదారుల నుండి మంచి ఆదరణ లభిస్తున్నది. రుచికరమైన, నాణ్యమైన టిఫిన్‌లను అందిస్తున్నాము. పెద్ద పెద్ద హోటళ్లకు తీసిపోకుండా అన్ని రకాల వంటకాలను అందిస్తున్నాం.

- జనార్ధన్‌రెడ్డి, మొబైల్ క్యాంటీన్ యజమాని

ఏడాదిలో కాంగ్రెస్ సాధించింది శూన్యం



పరిగి: మాట్లాడుతున్న మాధవరెడ్డి



కులకచర్ల: పరిగికి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కరణం ప్రహ్లాద్‌రావు

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 66 అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతికిరణ్, ఓబిసి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెన్నె ఈశ్వరప్పలు అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ గారడి-66 మోసాలపై బీజేపి ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌వీ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఓటు బ్యాంకు రాజకీయాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏమిటో చూపించేందుకు ఇప్పటి నుంచి కార్యకర్తలు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల పెంటయ్య, శ్రీనివాస్, శంకర్‌నాయక్, నర్సింహా, పరమేశ్వర్‌రెడ్డి, రాంచందర్, వెంకటయ్యగౌడ్, రాముయాదవ్, మల్లేశ్, బాలకిష్టారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని నిరసిస్తూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కులకచర్ల చౌరస్తా నుంచి పరిగి వరకు బీజేపీ బైక్ ర్యాలీని రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్పతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సౌమ్యరెడ్డి, సురేశ్, జానకిరామ్, వెంకటయ్య గౌడ్, అంజిలయ్య, షైపాల్, చంద్రలింగం తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: పూడూరు మండల కేంద్రంలో బీజేపీ చేపట్టిన బైక్ ర్యాలీలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎంపీ ఉత్సాహంగా పాల్గొన్నారు. బైక్ రైడ్ చేస్తూ నాయకులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేష్ పటేల్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, రవీందర్, వెంకటన్న, రాఘవేందర్, శ్రీశైలం, సుభాన్, సత్యనారాయణ, బుచ్చన్న, శ్రీకాంత్, అరుణ్ పాల్గొన్నారు.



పూడూరు: బైక్ ర్యాలీలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలం

మేడ్చల్ టౌన్: ప్రజా పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ అన్నారు. సరూర్‌నగర్‌లో బీజేపీ బహిరంగ సభకు మేడ్చల్ బీజేపీ నాయకులు పెద్దఎత్తున బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు, వంశీధర్ రెడ్డి, జాగక ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొడంగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా పురోహితులు పూజలు నిర్వహించారు. శ్రీ వరహా స్వామి ఆలయం ఆవరణలో సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో తాండూరు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సుబ్రమణ్య స్వామిషష్టి సందర్భంగా పల్లకీసేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి సోదరుడైన సుబ్రమణ్యస్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అయ్యప్ప స్వామి భజన సంకీర్తనలు పాడుతూ పల్లకీ సేవలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

కులకచర్ల: ఎర్రగోవింద్ తండాలో ఆంజనేయ స్వామి, కాళికాదేవి విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా శనివారం ఊరేగింపు నిర్వహించారు. తండాలోని వీధుల మీదుగా విగ్రహాలను వేదమంత్రోచ్ఛరణలు, డప్పుల చప్పుళ్లతో ఊరేగించారు. ఆదివారం లోక్‌మాసంద్ ప్రభు ఆలయం ఆవరణలో ఆంజనేయస్వామి, కాళికాదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యమ్మ, మాజీ ఎంఈవో హరిశ్చందర్, తండావాసులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం ప్రారంభం

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపల్ పూడూరులో శనివారం నిర్వహించిన సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్ యాదవ్, బాబుయాదవ్, దయానంద్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మేడ్చల్ టౌన్: సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కులకచర్ల, డిసెంబరు 7: ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కేజీబీవీలో శనివారం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతీ ఉపాధ్యాయురాలు ఓ బాధ్యతగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంట గది శుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు నీటితో శుభ్రపర్చాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. విద్యార్థులకు వేడి భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కులకచర్ల కేజీబీవీలో మాట్లాడుతున్న పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి ప్రవీణ్‌కుమార్

ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

పూడూరు, డిసెంబరు 7: స్థానిక ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విద్యాధికారి సాయిరెడ్డి, హెచ్‌ఎం అంజిలయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్న, జీహెచ్‌ఎం సోమన్‌గుర్తి, వెంకటేశం, ఏఏపీసీ చైర్మన్ ఫరీదా, ఉపాధ్యాయులు సంతోష, మాణిక్యచారి, పుష్పలత, లక్ష్మి, నిఖిల, అస్మాబేగం, సుమంత్, కృష్ణమాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు అందించడమే ధ్యేయం

శామీర్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు అందుబాటులో వైద్యసేవలందించడమే మెడిసిటీ ఆస్పత్రి ధ్యేయమని డాక్టర్ మేఘన అన్నారు. మండలంలోని లాల్‌గడిమలకపేట, శామీర్‌పేట పంచాయతీ కార్యాలయాల వద్ద ఘనపూర్‌కు చెందిన మెడిసిటీ ఆస్పత్రి వారు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మెడిసిటీ ఆస్పత్రి స్పెషలిస్టు డాక్టర్లు మేఘన, భార్గవ్, కళాంజలిలు 200మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు.

పంచాయతీల్లో పోలింగ్ బూత్‌ల జాబితా ప్రదర్శన

కులకచర్ల, డిసెంబరు 7: గ్రామాల వారీగా పోలింగ్ బూత్‌ల వివరాలను పంచాయతీల వద్ద నోటీస్ బోర్డులో పొందుపర్చినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల పోలింగ్ బూత్‌ల వివరాల జాబితాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి మండల పరిధిలో 45 పంచాయతీలు ఉన్నాయని, అందులో మొత్తం ఓటర్లు 50,097 ఉండగా పురుషులు 25,084, మహిళలు 25,009, ఇతరులు నలుగురు ఉన్నారని తెలిపారు. మొత్తం 45 పంచాయతీల్లో 380 వార్డులు ఉన్నాయని తెలిపారు. 200 మంది ఓటర్లకు ఒక్కో పోలింగ్ బూత్ చొప్పున 314 పోలింగ్ కేంద్రాలు, 201 నుంచి 400 ఓటర్ల వరకు 66 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎన్నికల కోసం శనివారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను మండల అధికారులు, సిబ్బంది నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఎన్నికల కోసం వార్డుల వారిగా పోలింగ్ కేంద్రాల ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారులు ప్రదర్శనకు పెట్టారు. ఈ ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12తేదీ లోపు లిఖితపూర్వకంగా ఓటర్లు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో మమత బాయి ప్రకటించారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



కొడంగల్: సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు ఆయన శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, కౌడె మహేష్ పాల్గొన్నారు.

కొడంగల్: అనారోగ్యం బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమళ్లకు చెందిన కమ్మరి రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ మండల నాయకులు శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, ఎల్లప్పగౌడ్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లోని శివసాయి కళ్యాణ మండపంలో ఆదివారం(నేడు) ఉదయం 11గంటలకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి విచ్చేయనున్నట్లు మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ డీఎస్ రజిని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరవుతారని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హోం గార్డులు

వికారాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో హోం గార్డులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హోంగార్డ్స్ అధికారులకు రోజువారి వేతనం రూ.వెయ్యి, యూనిఫాం అలవెన్స్, వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.200లు, మృతి చెందిన హోం గార్డ్స్ అధికారుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం, మెరుగైన వైద్యచికిత్సకు హెల్త్ కార్డులను ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా హోంగార్డ్స్ అధ్యక్షుడు సుధాకర్, హోంగార్డులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.